తాసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- బాలానగర్‌లో ఆదివారం తలుపులు మూసుకుని అధికారుల విధులు

ఆర్ఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

బాలానగర్, జూన్ 23: ప్రభుత్వ కార్యాలయంలోని విలువైన దస్త్రాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఇష్టారాజ్యంగా ఆడుతున్నాయని, ఆదివారం సెలవు రోజున బాలానగర్ తాసీల్దారు కార్యాలయం తలుపులు మూసుకుని విశ్రాంత ఉద్యోగితో ఆర్ఐ పనులు చేయిస్తున్నారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో బాలానగర్ తాసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కార్యాలయంలో ఆర్ఐ వెంకట్‌రెడ్డి, విశ్రాంత ఆర్ఐ గిరప్ప తలుపులు మూసుకుని లోపల పనిచేస్తున్న విషయం గమనించారు. ప్రైవేటు వ్యక్తులతో విలువైన దస్త్రాల్లో మార్పులు చేర్పులు చేయడం ఏమిటని..? అధికారులను నిలదీశారు. అధికారుల పనితీరు కారణంగానే కార్యాలయాల్లోని దస్త్రాల్లో అవకతవకలు ఏర్పడి భూ తగాదాలు పెరుగుతున్నాయని, నీ సంగతి ఏమిటో చూస్తానంటూ ఆర్.ఐ వెంకట్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణికి సంబంధించిన దస్త్రాలను పూర్తిచేయాల్సి ఉందని, అదనపు కలెక్టర్ అనుమతితోనే విశ్రాంత ఉద్యోగితో పనులు వేగవంతం చేస్తునామని ఆర్ఐ వెంకట్‌రెడ్డి చెప్పగా... కనుక్కుంటానంటూ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్‌తో మాట్లాడారు. మూడో వ్యక్తితో అధికారులు పనులు చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా ఆర్ఐతో పాటు కార్యాలయంలో పనిచేస్తున్న విశ్రాంత ఆర్ఐ గిరప్పను పోలీసులకు అప్పగించారు. గిరప్పపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల నాయకులు శంకర్, దత్తాత్రేయ, రఫీక్, భద్రునాయక్, వెంకట్‌నాయక్, బిచ్చూనాయక్, మహేందర్, యాదయ్య పాల్గొన్నారు.

కల్వర్టును బాగుచేయండి సారూ..

ఎలిగండ్ల కాల్వ వద్ద రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

మరికల్, జూన్ 23: మండలంలోని ఎలిగండ్ల గ్రామానికి వెళ్లే దారిపై కోయిల్‌సాగర్‌కాల్వ దగ్గర కల్వర్టు వద్ద రోడ్డుపై పెద్దగొయ్యి ఏర్పడడం తో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ ప్రమాదాలు సైతం జరగడంతో గొయ్యిపై ముల్లకంప ఏర్పాటు చేశారు. గతంలో రోడ్డు వేయగా కల్వర్టు వద్ద గొయ్యి ఏర్పడింది. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై ఏర్పడిన గొయ్యిని పూడ్చి రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనియెడల ఆందోళన చేస్తామని వారు తెలిపారు.

కోటకొండలో ఉద్రిక్తత

- ఏరువాక తాడు తెంపే క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- దాడులకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని ధర్నా

నారాయణపేట రూరల్, జూన్ 23 : నారాయణపేట జిల్లా కోటకొండ గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. ఏరువాక తాడు తెంపే విషయంలో మొదలైన వివాదం.. ఇరువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడే స్థాయికి చేరుకున్నది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. శుక్రవారం ఏరువాకతాడు తెంచే సమయంలో కోటకొండ గ్రామానికి చెందిన హరిజన్ చంద్రప్పపై పలువురు యువకులు దాడికి పాల్పడ్డారు. దీంతో చంద్రప్ప పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణలో భాగంగా శనివారం గ్రామానికి పోలీసులు వస్తున్నారని చంద్రప్ప ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో మరోసారి చంద్రప్ప, మరో వర్గం యువకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. ఇరువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడగా.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిల్లా కేంద్రంలో ధర్నా..

దాడిలో గాయపడిన వారిని కోటకొండలో దళిత, ప్రజా సంఘాల నాయకులు ఆదివారం పరామర్శించారు. అనంతరం రూరల్ పోలీస్‌స్టేషన్ (అప్పక్‌పల్లి)లో వివరాలు తెలుసుకునేందుకు వెళ్లగా అక్కడ ఎస్సై అందుబాటులో లేరు. దీంతో కోటకొండ గ్రామంలోని మాదిగవాడలో దళితులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దళిత, ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు 307 హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని పట్టుబట్టారు. పోలీసులు ధర్నాను విరమించేందుకు యత్నించగా.. ప్రజాసంఘాల నాయకులకు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌తో ఫోన్‌లో మాట్లాడించినప్పటికీ వినకపోవడంతో ఎస్పీ ధర్నా వద్దకు చేరుకొని తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాలో అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు మహేశ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు వెంకటేశ్, రమేశ్, చంటి, హన్మంతు, కృష్ణ, రాజు, పాండు, సీపీఎం నాయకుడు బలరాం తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న దళిత సంఘం నాయకులు

మామిడి తొక్కు మరింత పిరం

- కాయలకు పెరిగిన డిమాండ్
- అమాంతం పెరిగిన ధరలు
- వాతావరణ మార్పులతో నేలరాలిన మామిడి

మార్కెట్‌లో అమ్మకానికి పెట్టిన మామిడి కాయలు

తినడానికి సిద్ధంచేసిన మామిడికాయ పచ్చడి

అచ్చంపేట రూరల్, జూన్ 16 : వానకాలం ప్రారంభమైతే చాలు పొలం పనులు ప్రారంభమవుతాయి. ఈ సమయంలో పల్లె జనం వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. ఈక్రమంలో కూరగాయలతో వంట చేసుకునే తీరిక లేక మామిడి కాయ పచ్చడి(తొక్కు) తయారీకి మక్కువ చూపుతారు. చాలామందికి నోరురించే మామిడి తొక్కు లేనిదే ముద్ద కూడా దిగదు. జూన్‌లో మామిడికాయలతో పచ్చడి చేస్తే ఏడాది పొడవునా అది చెక్కు చెదరకుండా ఉంటుందని మహిళల విశ్వాసం. ఇదిలా ఉండగా ఈ ఏడాది మామిడికాయలకు తీవ్ర కొరత ఏర్పడింది. వాతవరణంలో మార్పుల కారణంగా దిగుబడి తగ్గడంతో పచ్చడికి మామిడికాయలు లభించక సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. అదేవిధంగా పచ్చడికి అవసరమైన ఇతర సామగ్రి ధరలు కూడా అమాంతంగా పెరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. చాలామంది కూలీలు, రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేవారు మధ్యాహ్నం మామిడిపచ్చడితోనే అన్నం తింటారు. ఈ ఏడాది వాతవరణంలో మార్పుల కారణంగా మా మిడి పూత, కాత దశలోనే రాలిపోయింది. అక్కడక్కడా కాసిన కాయలు ఇటీవల వీచిన ఈదురుగాలులకు నేలరాలాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ మామిడికాయల కొరత ఏర్పడింది. దీంతో పచ్చడి కాయలకు ధర అమాంతం పెరిగింది. ఒక్కో కాయ ధర రూ.5 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేస్తున్నారు. కిలో లెక్కన రూ.100 నుంచి రూ.180 వరకు పలుకుతున్నది. 20 కిలోల వరకు పచ్చడి చేసుకునే కుటుంబాలు నేడు 5 నుంచి 10కిలోలకే పరిమితమయ్యారు.

ధరలు పెరగడంతో..

ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చడికి అవసరమైన సామగ్రి ధరలు మండిపోతున్నాయి. కేజీ కారం ధర రూ.500 నుంచి రూ.600, కిలో జీలకర్ర ధర రూ.70, కిలో నువ్వుల నూనె ధర రూ.250, వెల్లుల్లి కిలో రూ.350, కిలో అల్లం రూ.250, మెంతులు కిలో రూ.250, ఆవాలు కిలో రూ.350, లీటర్ నూనె రూ.190 వరకు ధరలు పలుకుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా రెడిమేడ్ పచ్చళ్లు రుచికరంగా ఉండకపోవడంతోపాటు త్వరగా పాడైపోవడంతో సామగ్రి ధర పిరమైనా మామిడి పచ్చడి తయారీకి ప్రజలు మొగ్గుచూపుతున్నారు.

ధరలు పెరిగినా తప్పడం లేదు..

మామిడికాయల ధరలు మండుతున్నాయి. ఒక్కో కాయను రూ.5నుంచి రూ.10 వరకు అమ్ముతున్నరు. కాయలు కూడా దొరుకుతలేవు. ఆదివారం అచ్చంపేట సంతకు మాత్రమే వస్తున్నాయి. కొంతమంది రైతులు రోడ్లపైనే అమ్ముతున్నరు. మార్కెట్ మామిడికాయలు, పచ్చళ్లకు రేట్లు పిరమైనయి. మేం ఏడాదికిఇ 20కిలోల పచ్చడి పెట్టేటోళ్లం. ధరలు పెరిగినందుకు 10 కిలోలే పెట్టుకున్నం.

- నీలం లక్ష్మమ్మ

కాంగ్రెస్ నాయకుడిపై హత్యాయత్నం

- బీజేపీ నేతలపై కేసు నమోదు

దేవరకద్ర, జూన్ 23 : దేవరకద్ర పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాశ్‌పై బీజేపీ నాయకులు హత్యాయత్నానికి పాల్పడడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగన్న తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్ శనివారం రాత్రి ఓ దాబాలో భోజనం చేస్తుండగా స్థానిక బీజేపీ నాయకులు పడమటి వీరారెడ్డి, రాజు, చింటు వారితో వాగ్వాదానికి దిగారు. అదికాస్త పెరిగి ఘర్షణకు దారితీసింది. బీజేపీ నాయకులు మారణాయుధాలతో దాడి చేయడంతో ప్రకాశ్ మెడపై బలమైన గాయలయ్యాయి. దీంతో బాధితుడిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా అతడికి 26 కుట్లు పడాయని తెలిపారు. ప్రకాశ్ ఫిర్యాదు మేరకు ఆదివారం బీజేపీ నాయకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

గాయపడిన ప్రకాశ్

సరెండర్ చేయవద్దు

జీవిత బీమాపై నిపుణులు ఏమంటున్నారో తెలుసా

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నవారు, అధిక మొత్తాల్లో ఉన్న ప్రీమియంలు చెల్లించలేకపోతున్నవారు, పాలసీ అనవసరంగా భావించినవారు.. తమ జీవిత బీమా పాలసీలను సరెండర్ చేస్తూంటారు. మరికొందరు అమ్ముతూ ఉంటారు. అయితే ఈ రెండింటిలో ఏది లాభం? నిపుణులు ఏం చెప్తున్నారు.

ఇదీ సంగతి..

మీ జీవిత బీమా పాలసీని సరెండర్ చేయడం కన్నా.. అమ్ముకుంటే ఎక్కువ మొత్తంలో నగదును పొందగలరని నిపుణులు సూచిస్తున్నారు. పాలసీని సరెండర్ చేయడం అంటే మీ కవరేజీని రద్దు చేసుకోవడమే. మీ పాలసీ పత్రాలను తిరిగి సదరు కంపెనీకే ఇచ్చేయాల్సి ఉంటుంది. ఇందుకుగాను మీకు ఆ బీమా పాలసీని అమ్మిన సంస్థ.. వెంటనే దాని సరెండర్ విలువను చెల్లిస్తుంది. సంస్థ నిర్ణయించినదే వస్తుంది. ఎలాంటి సంప్రదింపులకు ఆస్కారం లేదు. ఈ క్రమంలో ఏవైనా చార్జీలు పడితే వాటిని ఆ మొత్తం నుంచి మినహాయించుకుంటుంది కూడా. దీంతో మీకు తక్కువ నగదు మొత్తాలు రావచ్చు.



సెకండరీ మార్కెట్‌లో..

మీకు అనవసరంగా అనిపించిన లేదా మీరు భారంగా భావించిన మీ పాలసీని సరెండర్ చేయకుండా సెకండరీ లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి కూడా వీలున్నది. దీన్ని లైఫ్ ఇన్సూరెన్స్ సెటిల్మెంట్‌గా పిలుస్తారు. సరెండర్ చేస్తే మీకు త్వరితగతిన మీరు చెల్లించిన నగదు తిరిగి రావచ్చుగానీ.. అమ్ముకుంటే మాత్రం ఎక్కువ మొత్తంలో నగదును పొందే అవకాశం ఉంటుంది. ఇక అమ్ముకుంటే మీ పాలసీ ప్రీమియంలన్నీ కూడా దాన్ని కొన్నవారే చెల్లిస్తారు. అలాగే మీరు చనిపోయినప్పుడు మీ మరణానంతర ప్రయోజనాలన్నీ కూడా పాలసీని కొన్నవారికే అందుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే పాలసీ యాజమాన్య హక్కులను మీరు అమ్ముకుంటున్నారన్నమాట.

జీవిత బీమా సరెండర్ చేస్తే..

అనుకూలతలు	ప్రతికూలతలు
✓ త్వరగా మీ పాలసీ నుంచి బయటపడుతారు	✗ సరెండర్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.
✓ మీరు మీ పెట్టుబడిలో కొంత మొత్తాన్ని తిరిగి పొందుతారు	✗ ఎలాంటి సంప్రదింపులకు తావుండదు

అమ్ముకుంటే

అనుకూలతలు	ప్రతికూలతలు
✓ మీ పాలసీకి మీరు మరింత సొమ్మును పొందవచ్చు	✗ సరైన కొనుగోలుదారుడిని వెతికేందుకు సమయం పట్టవచ్చు
✓ కొనేవారినిబట్టి రకరకాల ఆఫర్లు, సంప్రదింపులకు వీలుంటుంది	✗ లాయర్ లేదా ఇన్సూరెన్స్ బ్రోకర్ల సాయం తీసుకోవాల్సి రావచ్చు

ఎవరు కొంటారు?

సెకండరీ మార్కెట్‌లో జీవిత బీమా పాలసీల్లో తమ నగదును పెట్టుబడిగా పెట్టే ప్రైవేట్ ఇన్వెస్టర్లు కొంటారు. అలాగే ప్రైవేట్ సెల్లర్ల నుంచి జీవిత బీమా పాలసీలను కొనే లైఫ్ సెటిల్మెంట్ కంపెనీలుంటాయి. బ్రోకర్ల ద్వారా ఈ లావాదేవీలు జరుగుతాయి. ఇక బ్యాంకులు లేదా క్రెడిట్ యూనియన్ల వంటి ఇతర ఆర్థిక సంస్థలూ కొంటాయి. కాగా, వయస్సు, ఆరోగ్య పరిస్థితులనుబట్టి కూడా పాలసీలకు సెకండరీ మార్కెట్‌లో ధరలు పలుకుతాయి. అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటుంటే మరణం సంభవించే అవకాశాలు ఎక్కువ కాబట్టి అధిక మొత్తాల్లో చెల్లించి పాలసీలను కొనేందుకు బయ్యర్లు ముందుకొస్తారని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. అలాగే తక్కువ మొత్తాల ప్రీమియంలతో కూడిన పాలసీలున్నా.. ఆకర్షణీయ ధర లభిస్తుంది. పాలసీ కున్న మరణానంతర ప్రయోజనాలనుబట్టి కూడా ధరలు పెరుగుతాయి. పాలసీ సెల్లర్లు సంప్రదింపుల ద్వారా కూడా తమ పాలసీ ధరల్ని పెంచుకోవచ్చు.

చివరగా..

పాలసీని సరెండర్ చేయడమో లేదా అమ్ముకోవడమో అనేది పాలసీదారులకు చిట్టచివరి మార్గంగా మాత్రమే ఉండాలి. ప్రతీ చిన్న అవసరం కోసం జీవిత బీమా పాలసీలను వదులుకోరాదు. అలాగే ఆర్థిక సలహాదారులను సంప్రదిస్తే మరే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలనైనా వారు సూచించగలరు. అలా నిధుల అవసరాలను తీర్చుకోవచ్చేమోనని కూడా ప్రయత్నిస్తే మంచిది. దీనివల్ల కుటుంబానికి మేలు చేసినవారు అవుతారు. మీరు లేని సమయంలో మీ వాళ్లకు భరోసా ఒక్క బీమా మాత్రమేనన్నది మరువద్దు.

ఎదురయ్యే నష్టాలివే..

- జీవిత బీమాను సరెండర్ చేసినా, అమ్ముకున్నా మరణానంతర ప్రయోజనాలను కోల్పోతారు.
- ముఖ్యంగా మీ కుటుంబానికి అందే దీర్ఘకాలిక ఆర్థిక సుస్థిరత అవకాశాలు దూరమవుతాయి.
- అంతేగాక ఒక పాలసీని సరెండర్ చేస్తే.. మరొక పాలసీని తీసుకోవాలనుకున్నప్పుడు మీకు సమస్యలు ఎదురుకాగలవు.
- సరెండర్ చార్జీలతోపాటు మీరు అందుకునే నగదు మొత్తాలపైనా పన్నులు చెల్లించాల్సి రావచ్చు.
- తొందరపడి తీసుకునే నిర్ణయాలతో నష్ట తీవ్రత పెరుగవచ్చు.

ఇట్లుంటే తిప్పలు తప్పవు

ఆర్థిక ప్రగతిని సాధించాలంటే క్రమశిక్షణ ఎంత అవసరమో.. కొన్ని దురలవాట్లను దూరం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ప్రధానంగా పెట్టుబడులు, పొదుపు, ఖర్చులు ఇలా పలు అంశాల్లో తెలివిగా వ్యవహరించాలి.

ఆలోచించకుండా తొందరపాటుతో స్టాక్ మార్కెట్లలో నేరుగా పెట్టుబడులకు దిగితే నష్టాలే. పూర్తిస్థాయి అవగాహన ఉంటేనే ఇండివీడ్యువల్ స్టాక్స్‌ను కొనుగోలు చేయాలి. ఇక చిన్న మదుపరులు ఎట్టి పరిస్థితుల్లోనూ రిసెర్చ్ చేయకుండా మదుపు చేయరాదు. రిటైల్ ఇన్వెస్టర్లూ నిపుణులను సంప్రదించిగానీ స్టాక్స్ కొనుగోళ్లకు దిగవద్దు. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తి ఉంటే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ముందుకెళ్లవచ్చు.

అత్యవసర నిధిపై అశ్రద్ధ

అత్యవసర నిధిపై చాలామంది అశ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యంగా నేటి యువతరం సరదాలు, సంతోషాలకే ప్రాధాన్యతనిస్తూ ఖర్చులకు తెగబడుతున్నారు. క్రెడిట్ కార్డులు, మొబైల్ వ్యాలెట్లు అంటూ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారు. అందుకే కొంత నగదు మొత్తాలతో ఎమర్జన్సీ ఫండ్‌ను సృష్టించుకోవాలని సలహా.

బీమాపై చిన్నచూపు

బీమాను చిన్నచూపుతో చూడవద్దు. అలాగే దీన్నో పన్ను ఆదా సాధనంగా పరిగణించవద్దు. పాలసీలను పన్ను కోణంలో చూసి కొంటే.. దాని ప్రయోజనాలు పూర్తిగా అందవు. కాబట్టి ఆపత్కాలంలో అన్నివిధాల అండగా ఉండే బీమానే ఎంచుకోవాలి.

మితిమీరిన రుణ భారం

ఆదాయం ఉన్నదికదా అని నేడు చాలా మంది ఎడాపెడా అప్పులు చేసేస్తున్నారు. క్రెడిట్ స్కోర్ బాగుందంటూ ఎవరు ఏ రకంగా లోన్ ఇస్తామన్నా వద్దనకుండా తీసేసుకుంటున్నారు. దీనివల్ల రుణ భారం పెరిగిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నది.

ఆర్‌డీలను ఉపసంహరిస్తారా?

పోస్టాఫీస్ రూల్స్ ఏం చెప్తున్నాయ్

పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ)లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే.. దాని కాలపరిమితి ఐదేండ్లుంటుంది. అయితే ఈలోగా ఏదైనా అత్యవసరంగా నిధులు కావాల్సి వచ్చి సదరు ఆర్‌డీ ఖాతాను ఉపసంహరించుకోవాలంటే ఏం చేయాలి? నిబంధనలు ఎలా ఉంటాయి? వీటిని ఒక్కసారి పరిశీలిస్తే..

మూడేండ్ల తర్వాత..

తపాలా కార్యాలయ రికరింగ్ డిపాజిట్ ఖాతాలను.. మొదలుపెట్టిన మూడేండ్ల తర్వాత నిర్ణీత గడువు తీరకముందే ఉపసంహరించుకోవచ్చు. అంటే మూడేండ్లు పూర్తయితే ఐదేండ్లదాకా ఆగనవసరం లేదు. ఇక నేషనల్ సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్ రూల్స్ 2019 ప్రకారం ఫామ్-2లో అకౌంట్స్ ఆఫీస్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మీ ఆర్‌డీ ఖాతాను తెరిచిన పోస్టాఫీస్‌కే ఈ దరఖాస్తును 'ప్రీ మెచ్యూర్ క్లోజర్ ఆఫ్ అకౌంట్'గా అందివ్వాల్సి ఉంటుంది. అయితే అడ్వాన్స్ డిపాజిట్ చెల్లింపులుంటే వాటి కాలవ్యవధి ముగిసేదాకా ఆర్‌డీ ఖాతాను ముందస్తుగా మూసివేయలేం. కాగా, ఈ నెల 22న పోస్టాఫీస్ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన వివరాల ప్రకారం.. మెచ్యూరిటీకి ఒక్కరోజు ముందుగా ఖాతాను మూసేసినా దానికి పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటే వర్తిస్తుంది.

- ఖాతా తెరిచిన ఐదేండ్లదాకా ఆర్‌డీ నడుస్తూనే ఉంటుంది.
- మెచ్యూరిటీ తర్వాత కూడా సంబంధిత తపాలా కార్యాలయానికి దరఖాస్తు చేసుకొని మరో ఐదేండ్లు పొడిగించుకోవచ్చు.
- కాలవ్యవధిని పొడిగించుకున్న ఖాతాలను ఎప్పుడైనాసరే ఉపసంహరించుకోవచ్చు.
- పూర్తయిన సంవత్సరాలకు ఆర్‌డీ వడ్డీరేటే వర్తిస్తుంది. ఇంకా నెలల కాలం ఏదైనా మిగిలితే దానికి పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటును లెక్కించి చెల్లిస్తారు.
- నిర్ణీత కాలవ్యవధి వరకు నెలకు కనీసం రూ.10, ఆపై ఎంతైనా ఆర్‌డీల్లో పొదుపు చేసుకోవచ్చు. దీనికి ఫిక్స్‌డ్ వడ్డీరేటు వర్తిస్తుంది.

పెట్టుబడుల దిశగానే..

మార్కెట్ పల్స్

గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లు మెజారిటీ ట్రేడింగ్ సెషన్లలో లాభాలనే అందుకుని రికార్డు స్థాయిల్లో కదలాడాయి. అయితే ఆఖర్లో మదుపరులు లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడలేకపోయాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 217.13 పాయింట్లు పెరిగి 77వేల స్థాయికి ఎగువన 77,209.90 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 35.50 పాయింట్లు అందిపుచ్చుకుని 23,501.10 దగ్గర నిలిచింది. ఈ వారం సైతం సూచీలు ఓవరాల్‌గా లాభాల్లోనే కదలాడవచ్చన్న అంచనాలున్నాయి. లాభనష్టాల మధ్య కొట్టుమిట్టాడినా.. చివరకు ఓ మోస్తరు వృద్ధినే చూస్తాయన్న అభిప్రాయాలు ఎక్కువమంది నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, మదుపరులు అమ్మకాల ఒత్తిడి లోకి జారుకునే వీలు కూడా లేకపోలేదంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 23,600-23,800 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా అంటున్నారు.